# అడ్డం తిరిగింది కథ

రచయిత:

మలపాక వేంకటాచలపతి, బి.ఏ. (ఆనర్సు).

౧

...కళ్లు జ్యోతులులా ఉన్నాయి, యింకా పడిస్తే రక్తం కారుతుందా, అన్నట్లు. ఒక్కడూ గదిలోకూర్చుని ఏమేమిటో ఆలోచనలో పడ్డాడు.

'తాయిలం' అంటూ వెనకాల చేతులు పెట్టుకొని శంకరం 2 ఏళ్లు కుర్రాడువచ్చి తండ్రి ఆలోచనలను మటుమాయంచేశాడు. తండ్రి ఊరికే చూశాడు కొడుకువంక.

'సీకింతేనా పెత్తను' అన్నాడు తండ్రిని చూచి.

'నాకొద్దులే నాన్నా, యిల్లాదామ్మా' అని రామమూర్తి దగ్గరికి తీసుకోబోయాడు 'అమ్మా- దాను' అంటూ దూరంగావెళ్ళిపోయాడు శంకరం.

అభం శుభం ఎరగని ఆకుర్రాణ్ణి జూచి ఏడవాలో నవ్వాలో కూడా తెలియలేదు రామమూర్తికి.

శంకరం గదిమూలకెళ్లి నెమ్మదిగా భూరి చిదిపి తింటున్నాడు. అల్లాటి సమయాల్లో ఇంక మాట్లాడడు. రామమూర్తి మళ్లీ ఆలోచనలో పడ్డాడు. పండువంటిసంసారం అల్లా భగ్నమవుతుందని ఎప్పుడూ అనుకోలేదు. ఏదోశాస్త్ర జ్వరమేకదా తగ్గకపోతుందా అనుకొన్నాడుగాని తనకొంప ముంచుతుందనుకోలేదు. పిల్లలిద్దరు చిన్నవాళ్లు. వాళ్లనెవరు చూస్తారు. ఎవరుచూస్తే తల్లిలేనిలోటు తీరుతుంది? ఎంతకాలమని తల్లిని మరిపించగలడు?

'తమ్ములూ, చంకలం' అంటూ రాఘవులు గదిలోకివచ్చాడు. 4 ఏళ్లకుర్రాడు. 'ఇల్లాదామ్మారఘూ' అన్నాడు రామమూర్తి. గాని రాఘవులు ఏర దగ్గరికే వెళ్లాడు ఇద్దరూ బూరికోసం తగువు లారంభించారు.

'అమ్మనలుగు, నేపెత్త' నంటున్నాడు శంకరం. అమ్మెక్కడుందో వాడికేం తెలుసు?

రాఘవులు బలవంతాన్ని చిన్నముక్క చిదిపాడు. శంకరం బూరినేలనువేసికొట్టి వూరాం మొదలుపెట్టాడు.

ఇదిగదిలోగొడవ.

ఇకపైన—

సంభావనసరిగా ముట్టలేదని. బ్రాహ్మలు పీకిదాకా మెక్కినకంతాల్ని బాగాలేవనత్తి శ్రాద్ధాలుపెట్టు తున్నారు.

'సోమయాజని, యజ్ఞం తగులడ్డానాయెను- అర్థకితక్కువైతే పుచ్చుకొనను'—

'నామనవి వినండి' అని వెంకటశాస్త్రి.

ఆయనకర్థయిస్తే, నామొహానికి పావలాయేనా, అంటాడు చయనులు. 'ఇందాకా పుచ్చుకొని మళ్లీవస్తావేమయ్యా' అని వెంకటశాస్త్రి, అరుపులు—

వంటపందిల్లో—'నాకూతురో కూతురా' అని ముసలమ్మ, పన్నెడు అహూరాత్రాలు ఏడవడంమూలాని బొంగురుపోయిన కంఠంతో.

ఈగోలఅంతా చూచేసరికి 'సన్యసిద్దామా' అనిపించింది రామమూర్తికి.

౩

సంభావనబ్రాహ్మల సద్దణిగింది. ముసలమ్మ బొంగురుగొంతుక ఏడుపు మధ్యనుంచి రామమూర్తికి ఏవో గుసగుసలు వినబడుతు న్నాయి, పక్కగదిలోనుంచి.

'ఎంతవయస్సుంటుంది ?'

'13-వ ఏడు వెళ్ళింది. కాని వాళ్ళ... ...గోవగా 16 ఏళ్ళ...ఉంటారు.

'...బాగా ఎదిగినపిల్ల...రేపో మాపో అనేలాగుంటే...'

'అన్నయ్యా...చాదస్తం... నే నెరుగుదును ముక్కుతీరూ అది. ఎర్రతేలులా గుంటుంది'—రామమూర్తి మేనత్త.

'మంచిదెప్పుడో..రామమూర్తితండ్రి.'

'పంచాంగం తీసుకురండి' అన్నాడు. గంగమ్మ పంచాంగానికి రామమూర్తి ఉన్న గదిలోకి వచ్చింది.

'పంచాంగమెందుకు?' అన్నాడు రామమూర్తి.

'మీనాన్న తీసుకురమ్మన్నాడెందుకో'

'ఇల్లారమ్మను ఆయన్ని'

'ఎవరితోనో మాట్లాడుతున్నాడువస్తాడు'

'వెధవగొడవలకేమిలే గాని ఇల్లారమ్మను ఒకసారి—'

ఎప్పుడూ తండ్రినిగురించి పల్లెత్తుమాట అని ఎరగని రామమూర్తి నేటిమాటలు చూసి మేనత్త ఆశ్చర్యపోయింది.

'ఎందుకబ్బాయీ' అంటూ వెంకటశాస్త్రి వచ్చాడు.

'ఎల్లుండి ఆఫీసుకి వెళ్లాలి'

'ఈవారంరోజులు సెలవుపెట్టరాదూ.'

'వీల్లేదు'

'అంటే ?! వాళ్లుసెలవివ్వరా?'

'వాళ్లు సెలవుయివ్వరు, నాకుండటానికి వీల్లేదు'

శాస్త్రికెల్లా మాట్లాడాలో తెలియలేదు. గంగమ్మ అందుకుంది.

'చేబియ్యం వారిపిల్ల నిస్తామంటున్నారురా, రాముడూ'—అన్నది.

'వాడితో చెప్పేదేమిటే—'

'నాన్నా, మీరు పెద్దలుగాని, యీవిషయంలో మూర్ఖులులానడుచు కుంటున్నారు, నాపెళ్లాంచచ్చి పదిహేనురోజులు కాలేదు. అప్పుడే పెళ్లిబేరాలు, కొంపలుములిగి పోయినట్లు. మనిషి అన్నవాడికే దయాంతఃకరణాలు లేవుకాబోలు. వెధవశాస్త్రాలపేరు చెప్పి నెలలోనే ద్వితీయం చెయ్యాలి కాబోలు' 'ఏడిశావ్, పుల్లాయ్' నీకేంతెలుసు. ఎంతమంది చేసుకోడంలేదు! 12 రోజులు వెళ్లిన మన్నాడే చేస్తారు. నేనింకా 4 రోజులు ఆలస్యం జేస్తున్నాను'

'గొప్పపని చేస్తున్నారు? ...కూడా కూడాతిరిగేది పోతేదాని మాటేతల పెట్టకూడదూ తద్దినాలు పెట్టాలికావోయి ఆపేక్షమండి పోతున్నట్లు...అసలది పోయినట్లేలేదునాకు. అందెలుచప్పుడు చేసుకుంటో ఇంకా ఎక్కడనుంచో వస్తోన్నట్లేఉంది. అట్లాంటిదాన్ని మరిచిపోయి ఏదో విరిగిన చొక్కాపెంటమీద పారేసినట్లు పారేసి, మన్నాడే కొత్తదాన్ని కట్టుకుని కులాసాగా ఉండమంటారా!...

పదిమంది చేస్తున్నారన్నమాటేగాని యింకే మీ ఆలోచనక్కర్లేదా? మీకు కోపం వచ్చి నా సరేగాని ఆమాట తలపెట్టారంటే ఇంక మీ మొహం చూడను.....'

'అయితే అసలు పెళ్లే చేసుకోవుట్రా'

'ఇదేనా సమయం!'

3

జగన్నాథశాస్త్రికి విమల ఒక్కర్తేకూతురు. అంతగా కలవాడుకాదు శాస్త్రి. అందుచేత రెండోపెళ్లి కొడుకైనా 'రామమూర్తికి ఇవ్వడానికి' నిశ్చయించాడు.

విమలకి 13 ఏళ్లు వెళ్ళి 14-వ ఏడువచ్చినది. కట్నం ఇవ్వలేక తన్ను రెండో పెళ్లి వానికిస్తున్నాడు తండ్రిఅని తెలుసుకునే జ్ఞానం ఉన్నది. రామమూర్తి కూడ రెండో పెళ్లి అయినా అట్టే పెద్దవాడు కాడు. కాని ఎందుచేతనో ఈసంబంధము విమలకి నచ్చలేదు. తండ్రితో తనకీ పెళ్లి యిష్టము లేదని చెప్పటకు సాహసించలేకపోయినది. తల్లితో సిగ్గువిడిచి. చెప్పలేదు.* * * * *

నెలలోపుగ పెళ్లి చేయకపోతే తప్పుగా ఉంటుందని గంగమ్మ అన్నగార్ని వేధించుకుతిన్నది. వెంకటశాస్త్రికికూడ సంబంధము సమకూడిందికదా? రామమూర్తి అనుమతించేదేమిటని జగన్నాథశాస్త్రితో మాట్లాడి ముహూర్తము స్థిరపర్చాడు.

* * *

రామమూర్తి అత్తగారు పెళ్లి మాటలు విని ఇక ఆకొంపలో నిలవలేకపోయింది. మనుమల్ని తీసుకువెడ్తానని వెంకటశాస్త్రితో అన్నది. కాని గంగమ్మ పిల్లల్ని పంపవద్దని అన్నగారి నాజ్ఞ పెట్టింది. పెద్దకుర్రాడు రాఘవులు అమ్మమ్మతో వెడతానని మంకుపట్టుపట్టాడు. 'పల్లకీలో నాన్నతో కూర్చుందువుగాని, అమ్మమ్మతో వెళ్లవద్దని' గంగమ్మ కుర్రవాడికి చెప్పింది కాబోలు నీతో రాను, పల్లకీలో ఊరేగుతానని ముసలమ్మతో చెప్పాడు రాఘవులు. బాబుకి పెళ్లని సర్దాయే, కాని తనకి సవతితల్లి వస్తుందని కుర్రకుంకకేమి తెలుసు!

రామమూర్తికీ సందర్భాలన్నీ తెలుసు. తనతో సంప్రదించకుండా తనకిష్టము లేదని తెలిసికూడా పెళ్లి నిశ్చయించిన తండ్రిమీద చాలకోపము కలిగింది.

* * *

హడావడిగా జగన్నాథశాస్త్రి పెళ్లి ప్రయత్నాలు చేశాడు. దగ్గరచుట్టాలు నలుగురు వచ్చారు. కళ్లనీళ్లతో తలనీళ్లుపోసుకున్నది పెళ్లికూతురు. ...ముహూర్తసమయం దగ్గరకువచ్చింది. పెళ్లివారెంతకు రారు. ఇంతలో ఎవరోవచ్చి వెంకటశాస్త్రి యింట్లో గందరగోళముగానున్నదని జగన్నాథశాస్త్రితో చెప్పారు. కన్యాదాత వెంకటశాస్త్రి యింటికి పరుగెత్తాడు.

రామమూర్తి పెళ్లికి రానని భీష్మించుకు కూర్చున్నాడు–వెంకటశాస్త్రి బ్రతిమాలాడు. మేనత్త బ్రతిమాలింది, రామమూర్తి వినలేదు. 'నన్ను నల్గురిలోను అవమానం చేస్తావా' అన్నాడు తండ్రి. ససేమిరా! అన్నాడు రామమూర్తి.

ఎవరేమి జేయగలరు? బాజాలచప్పళ్లాగిపోయాయి. వాటినిమించి కంఠాలతో దెబ్బలాట ప్రారంభమైంది. రామమూర్తి 'మీరు కొట్టుకుచావండి, నాకడ్డము వచ్చారంటే జాగ్రత్త' అని కుర్రవాళ్లనుతీసుకుని రైలుకివెళ్లిపోయాడు.